


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 01 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 125 పేజీలు: 4 వెల: రూ 3-00


# తిరుగులేని శక్తిగా వైఎస్సార్‌సీపీ


**పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో వరుసగా విజయ దుందుభి**

**చంద్రబాబు కుప్పం కోట బద్దలు**

**సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు,సుపరిపాలనకు ప్రజలు పట్టం**

**శాసనమండలిలోనూ సంపూర్ణ ఆధిక్యత**

**వైఎస్సార్‌సీపీకి తీపిగుర్తులు మిగిల్చిన '2021'**




అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 2021 సంవత్సరం అఖండ విజయాలను అందించింది. పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో విజయదుందుభి మోగించి తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వాగ్దానాల్లో 95 శాతం హామీలను ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాదిలోనే ఆయన అమలుచేశారు. ఫలితంగా.. సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు.. అందిస్తున్న సుపరిపాలనతో వైఎస్సార్‌సీపీపై ప్రజాదరణ నానాటికీ పెరుగుతోంది.సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాలు (86.28 శాతం), 22 లోక్‌సభ స్థానాలను (88 శాతం) దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ.. పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడమే అందుకు తార్కాణం. 1983 ఎన్నికల్లో సొంత నియోజకవర్గంలో ఘోరంగా ఓడిపోయిన చంద్రబాబు.. 1989లో కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. దొంగ ఓట్లు.. దౌర్జన్యాలు, ప్రలోభాలతో మూడు దశాబ్దాలకు పైగా చంద్రబాబు కుప్పంను తన గుప్పెట్లో పెట్టుకున్నారు. కానీ.. పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో అక్కడ ఆయన ఆటలు సాగలేదు. టీడీపీని వైఎస్సార్‌సీపీ చావుదెబ్బ తీసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మాజీ కమిషనర్ నిమ్మగడ్డ ద్వారా ఏడాదిపాటూ స్థానిక సంస్థల ఎన్నికలను చంద్రబాబు అడ్డుకున్నప్పటికీ ఎన్నికల్లో మాత్రం ప్రజలు ఆయన్ను చావుదెబ్బ తీశారు. చివరకు ఈ ఏడాది మార్చి, నవంబర్‌లలో రెండు విడతలుగా 13 కార్పొరేషన్‌లు (నగర పాలక సంస్థలు), 86 నగర పంచాయతీ, మున్సిపాల్టీలకు ఎన్నికలను ఎస్ఈసీ నిర్వహించింది. ఈ ఎన్నికల్లో వంద శాతం అంటే.. 13 కార్పొరేషన్‌లను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 87 నగర పంచాయతీ, మున్సిపాల్టీల్లో 84 నగర పంచాయతీ, మున్సిపాల్టీల (98 శాతం)ను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. చంద్రబాబు మూడున్నర దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం కేంద్రంలోని కుప్పం మున్సిపాల్టీలో సైతం వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం గమనార్హం. మొత్తం 13,092 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తే.. 10,536 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. అంటే 80.4 శాతం గ్రామ పంచాయతీలను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుందన్న మాట. అదే కుప్పం నియోజకవర్గంలో 89 పంచాయతీలకుగానూ 74 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే విజయం సాధించి.. టీడీపీ కోటను బద్దలుకొట్టారు. రాష్ట్రంలో 652 జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలు (జెడ్పీటీసీ), 9,717 మండల పరిషత్ ప్రాదేశిక స్థానాల (ఎంపీటీసీ)కు ఎన్నికలు జరిగితే.. 642 జెడ్పీటీసీ స్థానాల (98.46 శాతం)ను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుని అఖండ విజయాన్ని సాధించింది. అలాగే, మొత్తం 13 జెడ్పీ చైర్మన్ పదవులనూ ఆ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఇక 9,717 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తే.. 8,380 స్థానాలు (86.24 శాతం) స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. 96 శాతం మండల పరిషత్ అధ్యక్ష పదవులను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని మొత్తం నాలుగు జెడ్పీటీసీ స్థానాలు, 68 ఎంపీటీసీ స్థానాలకుగానూ 63 ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. శాసన మండలిలో 58 స్థానాలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకూ మండలిలో టీడీపీ ఆధిక్యంలో ఉంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం, పలువురు టీడీపీ సభ్యుల పదవీ కాలం ముగియడంతో ఇటీవల ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో మండలిలో వైఎస్సార్‌సీపీ బలం 18 నుంచి 32కు ఒక్కసారిగా పెరిగి సంపూర్ణ ఆధిక్యత సాధించినట్లయింది.గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఒకే పార్టీ అధికారంలో ఉండటం దేశ చరిత్రలో ఇదే తొలిసారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా గ్రామ పంచాయతీలతోపాటు 13 జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు.. ఇలా అన్నింటా వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంది.

## గోరటి వెంకన్నకు సీఎం జగన్ అభినందనలు

అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2021కు ఎంపికయిన ప్రసిద్ధ వాగ్గేయకారుడు, ప్రజాకవి, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలియజేశారు. గోరటి వెంకన్న రచించిన 'వల్లంకి తాళం ' కవితా సంపుటికి ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ సీఎం గురువారం ట్వీట్ చేశారు. సామాన్యుడికి చేరేలా హావభావాలతోటి గ్రామీణ జానపదాలతో ఆయన ప్రజల హృదయాలు గెలిచారని, ఒక లెజెండరీగా ఎదిగారని తెలిపారు. వారి ప్రజా గేయాలు ఈనాటికీ యువకుల్లో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. ఆయనతో పాటు యువజన, పిల్లల విభాగంలో అవార్డులు గెలుచుకున్న తగుళ్ల గోపాల్, దేవరాజ్ మహారాజ్‌కు కూడా సీఎం జగన్ అభినందనలు తెలిపారు.

# చేనేత రంగాన్ని ఆదుకోవాలి: బుగ్గన



ఢిల్లీ: చేనేత వస్త్రాలపై 12శాతం పన్ను వేయాలన్న ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. 12శాతం పన్నును అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు వ్యతిరేకించారు. శుక్రవారం నిర్వహించిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ముగిసింది. సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ.. చేనేత వస్త్రాల మీద 12శాతం జీఎస్టీ వేయాలన్న ప్రతిపాదనను ఏపీ సహా అన్ని రాష్ట్రాలు వ్యతిరేకించాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలను జీఎస్టీ కౌన్సిల్ పక్కన పెట్టిందని, పాలిమర్, కాటన్ వస్త్రాలు ఉత్పత్తి శాతంపైన ఎలాంటి డేటా లేదని అన్నారు. రిఫండ్ శాతంపై ఎలాంటి వివరాలు లేకుండా నిర్ణయం తీసుకోలేమని చెప్పారు.మన రాష్ట్రంలో కాటన్ వస్త్రాల వాడకం ఉందని, చేనేత కార్మికులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారని తెలిపారు. చేనేత కార్మికులు, వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగకూడదన్నారు. చేనేత మీద లక్షలాది మంది కార్మికులు ఆధారపడి ఉన్నారని గుర్తుచేశారు. చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందని, చేనేత వస్త్రాల మీద ప్రస్తుతం ఉన్న 5శాతాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మొత్తం విషయంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పోలవరంపై సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని, ప్రీ బడ్జెట్ మీటింగ్‌లో విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. కొత్త భూసేకరణ చట్టం వల్ల పోలవరం ఖర్చు పెరిగిందని, వచ్చే బడ్జెట్‌లో దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరినట్టు చెప్పారు.ఉత్తరాంధ్ర, రాయలసీమ లాంటి ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. వెనుకబడిన ప్రాంతాలకు కేబీకే ప్యాకేజీ ఇవ్వాలని,నడికుడి-శ్రీకాళహస్తి, కడప-బెంగుళూర్ రైల్వే, కోటిపల్లి, రాయదుర్గం లైన్లతో పాటు పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరినట్టు పేర్కొన్నారు. జనవరి 12న జరిగే హోంశాఖ కార్యదర్శి సమావేశంలో విభజన చట్టం పెండింగ్ అంశాలను ప్రస్తావిస్తామని అన్నారు. దక్షిణ రాష్ట్రాల మండలి సమావేశంలో విభజన చట్టం పెండింగ్ అంశాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయం అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.




# దేశానికే ఆదర్శం నాడు...నేడు

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి**

**ఏఎన్‌యూలో పలు మౌలిక వసతులకు ప్రారంభోత్సవం**



విజయవాడ డిసెంబర్ 31, ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నూతన శకానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కోటి రూపాయాలతో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ఎగ్జామ్ సెంటర్, రూ.ఏడు కోట్లతో నిర్మించిన క్రీడా వసతి గృహం, అతిథి గృహాన్ని గురువారం సజ్జల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలో నాడు?నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంస్కరణలు ప్రారంభించారని చెప్పారు.ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. భావితరాల ప్రయోజనాల పరిరక్షణకు ముఖ్యమంత్రి దార్శనికతతో ముందుకు సాగుతున్నారని వెల్లడించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్యను అంకితభావంతో అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒకేసారి 16 మెడికల్ కాలేజీల ఏర్పాటు చరిత్రాత్మకమని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ సలహాదారు చల్లా మధుసూధన్‌రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణ, ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌టైల్స్ రంగంలో వినూత్న మార్పులు తెచ్చిన మోదీ ప్రభుత్వం : బీజేపీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలతో టెక్స్‌టైల్స్ రంగంలో మార్పులు తీసుకొస్తోందని బీజేపీ తెలిపింది. సమర్థ్ పథకం ద్వారా యువతకు సరికొత్త అవకాశాలను అందుబాటులోకి తెస్తోందని పేర్కొంది. స్టార్టప్ ఇండియా పథకం క్రింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోందని తెలిపింది. ఎగుమతుల లక్ష్యాన్ని సాధించడంలో మెరుగైన స్థితిలో ఉన్నట్లు వెల్లడించింది. భారత్‌ను పెట్టుబడుల గమ్య స్థానంగా నిలిపినట్లు తెలిపింది. బీజేపీ ట్విటర్ వేదికగా తెలిపిన వివరాల ప్రకారం, మన దేశంలో టెక్స్‌టైల్ రంగాన్ని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సమూలంగా సంస్కరిస్తోంది. రూ.4,445 కోట్ల వ్యయంతో 7 పీఎం మిత్ర (ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపారెల్) పార్కులను ఏర్పాటు చేస్తోంది. వీటిలో ఒక్కొక్క పార్కు వల్ల ప్రత్యక్షంగా 1 లక్ష మందికి, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం క్రింద ఐదేళ్ళపాటు రూ.10,683 కోట్ల మేరకు ప్రోత్సాహకాలను అందిస్తారు. టెక్స్‌టైల్ రంగంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ూంఓంఖీఊ పథకం క్రింద సంప్రదాయ రంగంలో కళాకారులు, వృత్తి పనివారికి నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. ఈ రంగంలో 3.45 లక్షల మంది



యువతకు లబ్ధి చేకూర్చడమే ఈ పథకం లక్ష్యం. స్టార్టప్ ఇండియా స్కీమ్‌లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్‌ను విప్లవాత్మకం చేస్తోంది. ప్రస్తుతం 60 వేలకుపైగా గుర్తింపు పొందిన స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. వీటిలో 45 శాతం స్టార్టప్‌లు మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటయ్యాయి. అత్యధిక స్టార్టప్ కంపెనీలు ఉన్న దేశాల జాబితాలో ప్రపంచంలో మూడో స్థానంలో భారత దేశం నిలిచింది.అదేవిధంగా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి భారత దేశాన్ని పెట్టుబడుల గమ్య స్థానంగా తీర్చిదిద్దినట్లు బీజేపీ తెలిపింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లు పెట్టేవారు అత్యధిక ప్రాధాన్యమిచ్చే దేశాల్లో ఒకటిగా భారత దేశాన్ని నిలిపినట్లు తెలిపింది. 2014-15తో పోల్చితే 2020-21లో వచ్చిన ఎఫ్‌డీఐలలో 80 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొంది. 2014-15లో 45.15 బిలియన్ డాలర్లు ఎఫ్‌డీఐలు రాగా, 2020-21లో 81.97 బిలియన్ డాలర్లు వచ్చినట్లు తెలిపింది.

# యువతరం చేతికి గ్రామ నాయకత్వం


**పంచాయతీల్లో రెండున్నరేళ్ల తర్వాత పట్టాలెక్కిన పాలన**

**కొత్తగా లక్షన్నర మందికి పైగా నాయకత్వ బాధ్యతల్లోకి..**



అమరావతి: రెండున్నరేళ్ల తర్వాత గ్రామాల్లో ఏప్రిల్ నుంచి తిరిగి సర్పంచుల పాలన మొదలైంది. 1,30,966 మంది వార్డు సభ్యులుగా, 13,097 మంది సర్పంచులుగా కొత్తగా నాయకత్వ బాధ్యతల్లోకి వచ్చారు. ఈ ఏడాదే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించగా.. 9,675 మంది ఎంపీటీసీలు, 650 జెడ్పీటీసీలు బాధ్యతలు చేపట్టారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర మందికి పైగా కొత్తగా నాయకత్వ బాధ్యతల్లోకి వచ్చారు. వీరిలో 85 శాతం మంది యువ నాయకత్వమే కావడం గమనార్హం. ఇదే సమయంలో గ్రామీణ పాలనలో ప్రభుత్వం పలు సంస్కరణలను తీసుకొచ్చింది.జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా గ్రామాల్లో గ్రామ కంఠంగా వర్గీకరించిన ప్రాంతంలో ఇళ్లకు తొలిసారి అధికారిక యాజమాన్య పత్రాల జారీ ప్రక్రియను చేపట్టింది. గ్రామాల్లో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా జిల్లా పరిషత్‌లలోనూ రెండో డిప్యూటీ చైర్మన్, మండల పరిషత్‌లలో రెండో ఉపాధ్యక్ష పదవులను కొత్తగా సృష్టించి పంచాయతీరాజ్ చట్టానికి ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. ఇప్పటికే జెడ్పీలో రెండో డిప్యూటీ చైర్మన్ పదవులకు ఎన్నికలు ముగియగా.. మండలాల్లో రెండో ఉపాధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉంది.

# ఏపీ హైకోర్టులో ఆనందయ్య పిటిషన్




అమరావతి: ఏపీ హైకోర్టులో ఆనందయ్య పిటిషన్ దాఖలు చేశారు. కరోనా మందు తీసుకొనేందుకు వస్తున్న వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని ఆనందయ్య పిటిషన్‌లో పేర్కొన్నారు. డివిజన్ బెంచ్‌లో విచారణకు సింగిల్ జడ్జి సూచించారు. గతంలో ఆనందయ్య మందుపై ధర్మాసనంలో విచారణ జరిగిన విషయాన్ని న్యాయవాదులు గుర్తుచేశారు. దీనితో ప్రధాన న్యాయమూర్తి దగ్గరకి పంపాలని సింగిల్ జడ్జి పేర్కొన్నారు.ఒమైక్రాన్ వేరియంట్‌కి తాను ఆయుర్వేద మందు తయారు చేశానని, పంపిణీకి సిద్ధంగా ఉందని ఇటీవల ఆనందయ్య ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి భారీగా వాహనాల్లో కృష్ణపట్నం వచ్చారు. కొవిడ్ బాధితులు, ఇతర వ్యాధిగ్రస్థులు నేరుగా గ్రామంలోకి వస్తుండటంపై కృష్ణపట్నం గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆనందయ్య ఇంటి వద్దకు వెళ్లి మందు పంపిణీని అడ్డుకున్నారు.

## చేనేతకు ఊరట.. జీఎస్టీ పెంపు నిర్ణయం వాయిదా

న్యూఢిల్లీ: చేనేత వస్త్రాలపై పన్నులు పెంచే విషయంలో కేంద్రం వెనక్కి తగ్గింది. జీఎస్టీ పెంపు నిర్ణయం వెలువడినప్పటి నుంచి దేశం నలుమూలల విమర్శలు రావడంతో కేంద్రం పునరాలోచనలో పడింది. దీంతో చేనేత వస్త్రాలపై జీఎస్టీని 5 శాతం నుంచి 12 శాతానికి పెంచే విషయాన్ని వాయిదా వేయాలని నిర్ణయించింది.న్యూఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం 2021 డిసెంబరు 31 జరుగుతోంది. ఈ సమావేశంలో జీఎస్టీ కౌన్సిల్ సభ్యులందరూ టెక్స్‌టైల్స్‌పై జీఎస్టీ పెంచడం సరికాదంటూ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. మరోవైపు దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు జీఎస్టీ పెంపుపై విమర్శలు ఎక్కు పెట్టాయి. దీంతో టెక్స్‌టైల్స్‌పై జీఎస్టీ పెంపు నిర్ణయాన్ని కేంద్రం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

# సంపాదకీయం

శనివారం 01 జనవరి 2022

## పంజాబ్ లో కొత్త పొత్తులు

శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పంజాబ్‌లో రాజకీయ పునరేకీకరణ పరాకాష్ఠకు చేరుకుంటున్నది. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా వుండి ఆ పార్టీ అధిష్ఠాన వర్గం దయ కోల్పోడంతో పదవీచ్యుతుడైన కెప్టెన్ అమరిందర్ సింగ్ తీవ్ర అసంతృప్తికి గురై అవమాన భారంతో రగిలిపోయిన సంగతి తెలిసిందే. సోనియా గాంధీ తనను చెప్పనలవికానంత మనస్తాపానికి గురి చేశారని, అయినా తాను పార్టీని విడిచిపెట్టనని ఒకవైపు చెబుతూనే మరోవైపు భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకులతో భేటీలు, మంతనాలు జరుపుతూ వచ్చిన ఆయన అడుగులు దానితో పొత్తు వైపే పడుతున్నాయని అనిపించింది. పంజాబ్ లోక్ కాంగ్రెస్ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్న అమరిందర్ సింగ్ ఇప్పుడా అంచనాలను నిజం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకుంటున్నట్టు ప్రకటించారు. భారతీయ జనతా పార్టీ పంజాబ్ ఇన్‌చార్జి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా దీనిని ధ్రువపరిచారు. శిరోమణి అకాలీదళ్ నుంచి చీలిపోయిన చిన్న చితకా ముఠాలను కూడా కలుపుకొని వచ్చే ఎన్నికలకు ఒక పెద్ద కూటమిగా సమాయత్తం కావాలని బిజెపి నిర్ణయించుకున్నది. పంజాబ్ ఎన్నికలు నాలుగు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య పోటీగా జరగనున్నట్టు స్పష్టపడుతున్నది. కాంగ్రెస్ పార్టీ, శిరోమణి అకాలీదళ్, ఆప్ (ఆమ్‌ఆద్మీ పార్టీ), బిజెపి కూటమి మధ్య గట్టి పోటీ వుండవచ్చు. ఈ విధంగా జరిగే పోటీలో ఓట్లు చీలిపోయి కాంగ్రెస్ దెబ్బతిని తనకు ప్రయోజనం కలుగవచ్చునని బిజెపి ఆశిస్తున్నది. రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన మూడు వ్యవసాయ చట్టాలనూ వారు కోరినట్టు ప్రధాని మోడీ ప్రభుత్వం రద్దు చేసినందున వారి ఓట్లు కూడా తన కూటమికి పడవచ్చునని అంచనా వేస్తున్నది. గతంలో అకాలీదళ్ కూటమిలో దానికి చిన్న తమ్ముడుగా అతి తక్కువ సీట్లతో సరిపెట్టుకున్న బిజెపి అమరిందర్ సింగ్ పార్టీతో బేరంలో అత్యధిక స్థానాలను సాధించుకోవచ్చునని భావిస్తున్నది. పంజాబ్ అసెంబ్లీలో 117 స్థానాలున్నాయి. అకాలీదళ్‌తో పొత్తులో బిజెపికి 23 స్థానాలు మాత్రమే దక్కేవి. మిగతా స్థానాల్లో అకాలీదళ్ పోటీ చేస్తూ వుండేది. అమరిందర్ సింగ్ పార్టీ పంజాబ్‌లోక్ కాంగ్రెస్‌తో సర్దుబాటు వల్ల ఆ రాష్ట్రంలో దాదాపు 70 స్థానాల్లో తలపడే అవకాశం తనకు దక్కుతుందని అది సంబరపడుతున్నది.కాంగ్రెస్ ఓటు బ్యాంకు అయిన జాట్ సిక్కులను, మైనారిటీ హిందూ మతస్థులను తన పార్టీ ఆకట్టుకుంటుందని అమరిందర్ సింగ్ ఆశపడుతున్నాడు. ఆ విధంగా కాంగ్రెస్‌ను దెబ్బ తీయవచ్చునని బిజెపి కూటమి అంచనా వేస్తున్నది. కొత్త వ్యవసాయ చట్టాల నేపథ్యంలో ప్రజల నిరసనను తట్టుకోలేక ఒకే ఒక్క కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్ ఈసారి బహుజన సమాజ్ పార్టీతో కలిసి పోటీ చేస్తున్నది. అయితే కాంగ్రెస్ తరపున మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి అయిన చరణ్‌జిత్ సింగ్ చన్నీ పార్టీ లోపలి నుంచి బయట నుంచి ఎదురవుతున్న సవాళ్లను చాకచక్యంగా ఎదుర్కొంటూ సామరస్య పరిష్కారాలు సాధించుకుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నట్టు చెబుతున్నారు. ఇది అమరిందర్ సింగ్ తిరుగుబాటు వల్ల కలిగిన లోటును పూడ్చుకోడంలో కాంగ్రెస్‌కు ఉపయోగపడవచ్చునని భావిస్తున్నారు. పటియాలా రాజవంశీకుడైన అమరిందర్ సింగ్‌కు సైన్యంలో పని చేసిన నేపథ్యముంది. 1984లో స్వర్ణ దేవాలయంపై సైనిక దాడిని నిరసిస్తూ కాంగ్రెస్‌ను వదిలిపెట్టిన అమరిందర్ సింగ్ అకాలీదళ్‌లో చేరారు. 1992 లో అకాలీదళ్‌ను వదిలిపెట్టి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి అందులోనే వుండి రెండు సార్లు పంజాబ్ ముఖ్యమంత్రి అయ్యారు. 2002-07 మధ్య కాలంలో పూర్తి కాలం కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా చేసిన ఆయన 2017లో తిరిగి ఆ పార్టీ తరపున సిఎం పీఠం అలంకరించి ఇటీవలి వరకు కొనసాగారు. 79 ఏళ్ల వృద్ధ నేత అమరిందర్ సింగ్‌కు ఈసారి ఎన్నికలు ఆయన రాజకీయ జీవిత చివరి ఘట్టం కావచ్చు. భారత సైన్యాలు పాకిస్తాన్‌లోకి జొరబడి అక్కడి తీవ్రవాదుల శిబిరాలపై చేసిన మెరుపు దాడుల (సర్జికల్ స్ట్రైక్స్)ను మెచ్చుకున్న అమరిందర్ సింగ్ పంజాబ్‌లో కొంత భూభాగాన్ని భద్రతా దళాల ఆధీనంలో వుంచడాన్ని కూడా సమర్థించారు. ఆ విధంగా ఆయన బిజెపికి సహజ మిత్రుడయ్యాడు. కాంగ్రెస్‌లో వుండగా క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ నుంచి తీవ్రమైన తిరుగుబాటును ఎదుర్కొన్న అమరిందర్ సింగ్ వ్యూహాత్మకంగా బిజెపితో కలిశారు. ముఖ్యమంత్రి పీఠంలో గల అమరిందర్ సింగ్ సలహాను కాదని కూడా నవజోత్ సింగ్ సిద్ధూను రాహుల్, ప్రియాంక గాంధీలు ప్రోత్సహించారు. అమరిందర్ సింగ్‌ను ఆయన స్వస్థలం పటియాలాలోనే ఓడిస్తానని సిద్ధూ సవాలు విసురుతున్నారు.

# వాయిస్ తోనే పెరుగుతున్న సోము



రాజమండ్రి, డిసెంబర్ 31,(న్యూస్ పల్స్)ఒక సభ పెట్టారు. సక్సెస్ అని సంబరాలు చేసుకుంటున్నారు. వైసీపీని ఓడించినట్లేనని భ్రమల్లో ఉన్నారు. ఇంతకీ బీజేపీ నేతలు ఏం సాధించినట్లు? విజయవాడలో సభ నిజంగా సక్సెస్ అయిందా? రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలను సమీకరించి సభ విజయవంతం అయిందని చెప్పుకోవడం సబబేనా? ఈ సభకు ప్రజామోదం ఉందా? ఈ నాయకులను ప్రజలు అసలు పట్టించుకుంటున్నారా? అంటే లేదు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. బీజేపీ నేతలకు మంచి వాగ్దాటి ఉంటుంది. ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నుంచి సోము వీర్రాజు వరకూ మాటల తోనే ఎదిగారు. ప్రజాబలం పెద్దగా లేకపోయినా వారి వాగ్దాటి వారికి పదవులను తెచ్చిపెట్టింది. కేవలం మాటలు ఉంటే చాలా? ప్రజామోదం అవసరం లేదా? అంటే బీజేపీ నేతల వద్ద సమాధానం లేదు. ఏపీ బీజేపీ ఈ ముప్ఫయి నెలల కాలంలో ఒక పెద్ద కార్యక్రమం చేపట్టిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా? అంటే లేవనే చెప్పాలి. రామతీర్థం, అంతర్వేదీ ఘటనల సమయంలో కొంత హడావిడి చేసిన బీజేపీ నేతలు తర్వాత కార్యాలయానికే పరిమితమయ్యారు. సోము వీర్రాజు పార్టీ అధ్యక్షుడు అయిన తర్వాత భారీ కార్యక్రమాలు చేపట్టిన పరిస్థితి లేదు. తిరుపతి, బద్వేలు ఉప ఎన్నికల్లో మాత్రం పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కపిల తీర్థం నుంచి రామతీర్థం వరకూ పాదయాత్ర అని ప్రకటించి తర్వాత వెనక్కు తగ్గారు. అలాగే అమరావతి రైతుల కోసం పాదయాత్ర అని చెప్పి దానిని కూడా వాయిదా వేశారు. ఇక కేంద్ర నాయకత్వం వత్తిడి మేరకు ఒక సభ పెట్టి వైసీపీని, టీడీపీని తిడితే ప్రజామోదం లభిస్తుందా? ప్రజలు గంపగుత్తగా వీరికి ఓట్లు వేస్తారా? వీరి డైలాగులు విని పోలింగ్ కేంద్రాలకు పరుగులు తీసి కమలం గుర్తుపై బటన్ నొక్కుతారా? కానీ బీజేపీ నేతలు మాత్రం అదే భ్రమల్లో ఉన్నారు. ఈ సభతో వైసీపీ పని అయిపోయిందట. టీడీపీ ఇక దుకాణం బంద్ చేయాల్సిందేనట. తాము మాత్రం బుగ్గ కారు కోసం ఇంట్లో కూర్చుని వెయిట్ చేస్తారట. ఇదీ ఏపీ బీజేపీ నేతల పరిస్థితి. పొరుగు జిల్లాల్లో అక్కడి బీజేపీ నేతలు ఎలాంటి ఆందోళనలు చేస్తున్నారో తెలుసుకుని కాస్త నేలమీదకు దిగితే బాగుంటుంది. జిన్నా టవర్ పై పాలిటిక్స్జిన్నా టవర్. గుంటూరులో ల్యాండ్ మార్క్. దేశానికి స్వాతంత్ర్యం రాకముందునుంచే అదక్కడ ఉంది. ఇప్పటికీ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఫేమస్ పాయింట్. జిన్నా టవర్ అనే పేరే గాని.. ఇంతకీ ఆ 'జిన్నా' ఎవరో.. ఆయన ఎక్కడి వారో.. గుంటూరువాసులకు అంతగా తెలీక పోవచ్చు. పిలవడమే గానీ.. ఆ పేరు గురించి వారెప్పుడూ అంతగా పట్టించుకున్నది లేదు. కానీ, ఇన్నాళ్లకి ఏపీ బీజేపీ నేతలు జిన్నా పేరును పట్టించుకున్నారు. అదేంటి? పాకిస్తాన్‌కు చెందిన జిన్నా పేరును.. ఆ దేశ ద్రోహి పేరును.. మన గుంటూరులో పెట్టడమేంటి? అంటూ ఇవాళే నిద్ర లేచారు ఏపీ కమలనాథులు. ఉదయానే బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ జిన్నా టవర్‌పై వివాదం రాజేశారు. జిన్నా పేరు తొలగించి.. అబ్దుల్ కలాం పేరునో.. గుర్రం జాషువా పేరునో పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయనకు వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డిలు వంతపాడారు. గంటల గ్యాప్‌లోనే ఈ విషయం తెలుసుకొని.. పక్క రాష్ట్రం తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వారి టోన్‌కు మరింత బేస్ యాడ్ చేశారు. జిన్నా పేరు తీసేస్తారా.. లేక, ఏకంగా టవర్‌నే కూల్చేయమంటారా? అంటూ రాజాసింగ్ తనదైన స్టైల్‌లో వార్నింగ్ ఇచ్చారు. ఇలా.. జిన్నా టవర్‌పై బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తూనే ఉన్నారు. బీజేపీ నేతల తీరు చూసి.. గుంటూరువాసులు విసుక్కుంటున్నారు. మాకు లేని అభ్యంతరం.. మీకెందుకు? అంటూ ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా హిందూ-ముస్లిం అనే తేడా లేకుండా గుంటూరులో కలిసుంటున్నామని.. ఇప్పుడు మీరొచ్చి.. జిన్నా పేరుతో రాజకీయం చేసి.. అనవసర ఉద్రిక్తతలను రెచ్చగొట్టొద్దని మండిపడుతున్నారు. విజయవాడలో సోము వీర్రాజు వారు వల్లించిన చీప్ లిక్కర్ వ్యాఖ్యలతో పార్టీకి తీవ్ర డ్యామేజ్ జరిగిందని.. ఆ టాపిక్ నుంచి పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేసేందుకే.. ఇలా గుంటూరు జిన్నా టవర్ పేరును ఇష్యూగా మారుస్తున్నారనే విమర్శలూ వస్తున్నాయి.

# విజృంభిస్తున్న జ్వరాలు



విజయనగరం, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైద్యారోగ్యశాఖ అధికారులు సకాలంలో నివారణ చర్యలు చేపట్టకపోవడంతో రోగులు సంచి వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. మండలంలో దిబ్బగుడ్డివలస ఎస్సీకాలనీలో సుమారు 10 మందికి వరకు జ్వరాలతో మంచపట్టారు. కాలనీకి చెందిన పి నరసమ్మ, తోట పారయ్య, తోట పోలీసు, స్వర్ణలత, జయలక్ష్మి, లక్ష్మి, బూరాడ పాపమ్మ తదితరులు మూడురోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వీరిలో కొందరు సీతయ్యపేట నుంచి వచ్చే ఆర్ఎంపీ వైద్యుడి వద్ద వైద్య చేయించుకుంటున్నారు. మరికొందరు బొబ్బిలిలోని ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్ ఉన్నప్పటికీ ఏఎన్ఎం అందుబాటులో ఉండడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హెల్త్ సబ్‌సెంటర్ సిబ్బంది ఓఆర్ఎస్, ఇచ్చి చేతులు దులుపుకున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం వల్లే జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు అంటున్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని కైలాం గ్రామంలో పలువురు జ్వరాలతో మంచం పట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడమే జ్వరాలకు కారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటిలో జ్వర పీడితులు ఉన్నారని చెబుతున్నారు. కొందరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు గజపతినగరం, విజయనగరం వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఇటీవల సంభవించిన పెథాయ్ తుఫాన్ వల్ల వాతావరణం మారడం కూడా వ్యాధులు ప్రబలుతున్నాయని పలువురు అంటున్నారు. ప్రస్తుతం గ్రామంలో బోని కురమమ్మ, కొరిపిల్లి రామానందం, గండి చిన్నంనాయుడు, చప్ప సన్యాసమ్మ, గండి గంగమ్మ, అప్పలకొండ, గండి ఎర్రయ్య, నారాయణమ్మ, కామేష్, యశ్వంత్ కుమార్, కొరిపిల్లి రోహిత్‌నాయుడు తదితరులు జ్వరాలతో బాధపడుతున్నారు. అయినప్పటికీ వైద్యాధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టడంలేదని విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫ్యాన్ లో మరో రఘురామ

నెల్లూరు, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)ఏపీలో అధికార వైసీపీ ప్రతిపక్షాలు ఏ స్థాయిలో విమర్శలు చేస్తున్నాయో అందరికీ తెలిసిందే. వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రతిపక్ష టీడీపీ ఎప్పుడు ఏదొక అంశంపై విమర్శలు చేస్తూనే ఉంటుంది. టీడీపీనే కాదు జనసేన, కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు సైతం జగన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. తాజాగా బీజేపీ సైతం జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మొదలుపెట్టిన విషయం తెలిసిందే.అయితే ప్రతిపక్షాలే కాదు?వైసీపీ నుంచి గెలిచిన ఎంపీ రఘురామకృష్ణంరాజు సైతం?తమ సొంత పార్టీపై ఎలాంటి విమర్శలు చేస్తున్నారో అందరికీ తెలిసిందే. గత రెండేళ్లుగా ఢిల్లీలో ఉంటూ రచ్చబండ పేరిట..రఘురామ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇలా రెబల్‌గా మారిన రఘురామపై వైసీపీ కూడా ఎదురుదాడి చేస్తుంది. ఆయనకు చెక్ పెట్టాలని నానా ప్రయత్నాలు చేస్తుంది. కానీ చెక్ పెట్టడం సాధ్యం కావడం లేదు. మధ్యలో ఒకసారి అరెస్ట్ చేసి ఇబ్బంది పెట్టడానికి ట్రై చేశారుగానీ?పెద్దగా అది కూడా వర్కౌట్ కాలేదు. ఇప్పటికీ రఘురామ, వైసీపీపై విరుచుకుపడుతూనే ఉన్నారు.రఘురామతోనే వైసీపీకి తలనొప్పి ఉంది అనుకుంటే ఇప్పుడు సీనియర్ ఎమ్మెల్యే ఆనం రామ్ నారాయణరెడ్డితో మరొక ఇబ్బంది వచ్చింది. మొదట్లోనే ఆనం?ప్రభుత్వంలో ఉన్న లోపాలని ఎత్తి చూపారు. మొదట్లో అధికారులు సరిగగా పనిచేయడం లేదని, అలాగే మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌పైన బహిరంగంగానే విమర్శలు చేశారు. తాజాగా పోలీసులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే రాష్ట్రంలో నక్సలిజం, టెర్రరిజం తగ్గుముఖం పట్టిందని, అయితే లోకల్ మాఫియా పేట్రేగిపోతోందని, లోకల్ మాఫియాతో కొందరు పోలీసులు చేతులు కలిపారంటూ పోలీస్ శాఖపై ఫైర్ అయ్యారు.ప్రజల్లో నమ్మకం భరోసా కల్పించాల్సిన పోలీసులే ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో రోజురోజుకూ సన్నగిల్లుతోందని అన్నారు. ఇలా ఆనం డైరక్ట్‌గా కామెంట్ చేయడంపై వైసీపీ పెద్దలు ఏమన్నా చర్యలు తీసుకుంటారా? లేక ఆయన్ని కూడా పార్టీ నుంచి సైడ్ చేసే కార్యక్రమం చేస్తారో చూడాలి. ఇప్పటికే ఆనంని సైడ్ చేసే కార్యక్రమం జరుగుతుందని తెలుస్తోంది. కొందరు వైసీపీ పెద్దలు వెంకటగిరిలో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి కుమారుడు రామ్ కుమార్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆనంని సైడ్ చేయడానికే ఇదంతా చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి వైసీపీలో ఆనం భవిష్యత్ ఎలా ఉంటుందో చూడాలి

# కొయ్యూరులో ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

విశాఖపట్నం విశాఖ జిల్లా కొయ్యూరు మండలం లో వివిధ ప్రాంతాలలో అరకు పార్లమెంట్ సభ్యురాలు జి మాధవి పాడేరు ఎమ్మె ల్యే కె భాగ్యలక్ష్మి శంకుస్థాపన కార్యక్ర మం నిర్వహించారు శరభన్నపాలెం గ్రామంలో 6 కోట్ల 39 లక్షల రూపాయల తో చింతపల్లి మండలం పంచాయతీ వరకు 11 కిలోమీటర్లు రహదారి అలా గే పంచాయతీ కొత్తపల్లి గ్రామం వరకు రెండు కోట్ల 63 లక్షలు నడింపాలెం నుంచి మాకు వారం వరకు కోటి రూపా యల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణా నికి శంకుస్థాపన కార్యక్రమం చేశారు ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మారు మూల ప్రాంతాల్లో సైతం అభివృద్ధి చేసేందుకు ఈ రహదారి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలి పారు గత పాలకులు పట్టించు కోకపో వడంతో పాడేరు ఐటీడీఏ పరిధిలో రోడ్డు కనెక్టివిటీ లేని రోడ్లు 900 ఉన్నా యని అధికారులు గుర్తించారని ఆమె అన్నారు అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లా డుతూ అత్యంత ప్రాధాన్యత కొయ్యూ రు మండలానికి ఇస్తున్నామని దీనిలో భాగంగానే అనేక అభివృద్ధి కార్యక్ర మాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు ఈ కార్యక్రమంలో చింత పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జల్లి అలియా రాని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి ఎంపీపీ బడుగు రమేష్ జడ్పిటిసి వారం ఒక రాజు మండల అధికారులు పాల్గొన్నారు.

## జనవరి2న అఖిలపక్ష సమావేశం

కాకినాడజనవరి 2న కాకినాడ అఖిల పక్షం సమావేశం స్థానిక కల్పన ఓవర్ బ్రిడ్జి దిగువ మహర్షి బులుసు సాంబమూర్తి ఓపెన్ మీటింగ్ హాల్ లో ఆదివారం ఉదయం 11గంటలకు జరుగు తుందని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగే సమావేశంలో బి సి సంఘాల రాజకీయ పార్టీల ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొం టారని తెలిపారు.

# పెంచేది లేదు.... క్లారిటీ ఇచ్చేసిన సర్కార్

విజయవాడ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)మొదట నెలన్నారు. ఆ తర్వాత వారం అన్నారు. అటుపిమ్మట 72 గంటల్లో పీఆర్సీ ప్రకటన వస్తుందన్నారు. ఇప్పుడు మళ్లీ నెలంటున్నారు. దీంతో పీఆర్సీ పంచాయితీ మళ్లీ మొదటికొచ్చింది. అలా అలా గడువు దాటేస్తున్నారే కానీ.. పీఆర్సీ మాత్రం ఇవ్వట్లేదు ప్రభుత్వం. చర్చల పేరుతో కాలయాపన మాత్రం చేస్తోంది. ఇచ్చినంత తీసుకుని.. నోరు మూసుకునేలా.. ఉద్యోగ సంఘాలపై ఒత్తిడి పెంచుతోంది. తాజాగా, పీఆర్సీపై ఏపీ సచివాలయంలో ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం సమావేశమైంది. ఆర్థికశాఖ అధికారులు విడతల వారీగా ఉద్యోగ సంఘాలతో చర్చించారు. ప్రస్తుతం 27 శాతం ఐఆర్ ఇస్తున్నందున.. దానిమీద ఇంకొంచం పెంచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం జగన్ ఆదేశించినట్టు అధికారులు ఉద్యోగ సంఘాలతో చెప్పారు. కొత్తగా రూపొందించిన ప్రతిపాదనలను వివరించారు. అయితే.. అధికారుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు ఉద్యోగ సంఘ నాయకులు. "సమావేశానికి పిలిచి పీఆర్సీ ఎంత ఇస్తారో చెప్పకుండా ఆర్థిక పరమైన అంశాలు వివరిస్తున్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్ప.. ఫలితం ఉండటంలేదు. జనవరి 3న జరిగే జేఏసీ సమావేశంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం" అని ఏపీ జేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసులు మండిపడ్డారు. ఉద్యోగులను అవమానించడానికి సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప ఉపయోగం లేదని అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. "ఏపీలో వచ్చే ఆదాయంలో రూ.75వేల కోట్లు ఉద్యోగుల కోసమే ఖర్చు చేస్తున్నామంటున్నారు. ఉద్యోగుల కోసం 32శాతం ఖర్చు పెడుతూ.. రాష్ట్ర బడ్జెట్ మొత్తం ఖర్చు చేస్తున్నామని చెప్పడం విడ్డూరం. ఫిట్‌మెంట్ ఎంత ఇస్తారంటే మళ్లీ మొదటికొచ్చారు. గతంలోనే ఎక్కువ జీతం తీసుకున్నారు.. దానికి తగ్గకుండా ఇస్తామని చెబుతున్నారు. ఇది అన్యాయం" అని బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

# రెక్కీతో లైమ్ లైట్ లోకి వంగవీటి

విజయవాడ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)ఏపీ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా వంగవీటి రాధా విషయం బాగా హల్చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇంతకాలం సైలెంట్‌గా ఉంటూ వస్తున్న రాధా సడన్‌గా తనని చంపడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, రెక్కీ కూడా నిర్వహించారని చెప్పి బాంబ్ పేల్చారు. అది కూడా కొడాలి నాని, వల్లభనేని వంశీ సమక్షంలో రాధా ఇలా మాట్లాడి అందరికీ షాక్ ఇచ్చారు. రాధా మాట్లాడినా వెంటనే..వైసీపీ ప్రభుత్వం నుంచి ఆయనకు సెక్యూరిటీ వచ్చిన విషయం తెలిసిందే.రాధా వైసీపీలోకి వెళ్లిపోతున్నారని, ఆయన్ని వైసీపీలోకి తీసుకెళ్లడానికి కొడాలి, వంశీలు ప్రయత్నిస్తున్నారని ప్రచారం మొదలైంది. కానీ ఆ తర్వాత రాధా సెక్యూరిటీని వద్దనడం, వెంటనే రాధాకు చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడటంతో సీన్ రివర్స్ అయింది. ఆయన వైసీపీలోకి వెళ్లరనే విషయం క్లారిటీ వచ్చేసింది. కాకపోతే రాధాని చంపడానికి రెక్కీ నిర్వహించింది ఎవరనే అంశంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.ఇదిలా జరుగుతుండగానే రాధా గురించి ఊహించని విషయం తెలిసింది. అసలు రాధా ప్రస్తుతం రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని విషయం తెలిసిందే. గత ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ఆయన, ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఏదో సొంత కార్యక్రమాలు చేసుకుంటున్నారు. కాపు వర్గంతో సమావేశాలు, రంగా విగ్రహావిష్కరణలకు వెళుతున్నారు. దీంతో రాధా రాజకీయాలకు దూరం జరిగినట్లు కనిపించింది.కానీ ఎప్పుడైతే ఈయనపై రెక్కీ నిర్వహించారని తెలిసిందో..అప్పుడే మరో విషయం కూడా బయటకు వచ్చింది. టీడీపీ కోసం రాధా బ్యాగ్రౌండ్‌లో వర్క్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అది కాపు వర్గం ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీని మళ్ళీ గెలిపించేందుకు గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్లు సమాచారం. సైలెంట్‌గా కాపు వర్గాలతో సమావేశం అవుతూ, టీడీపీని బలోపేతం చేసేందుకు రాధా కృషి చేస్తున్నారని తెలిసింది. మొత్తానికి రాధా టీడీపీలోనే ఉంటూ, చంద్రబాబుని మళ్ళీ సీఎం చేసేందుకు కష్టపడుతున్నట్లు తెలుస్తోంది

# బాలయ్య కోసం వైసీపీ వర్కౌట్...

అనంతపురం, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)హిందూపురం?తెలుగుదేశం పార్టీ కంచుకోట అనే సంగతి తెలిసిందే. ఇక్కడ టీడీపీ ఇంతవరకు ఓడిపోలేదు. 1983 నుంచి 2019 వరకు వరుసగా గెలుస్తూనే ఉంది. పైగా హిందూపురం అంటే నందమూరి ఫ్యామిలీ అడ్డా?గతంలో ఇక్కడ ఎన్టీఆర్ సత్తా చాటగా, ఆ తర్వాత హరికృష్ణ, ఇప్పుడు బాలకృష్ణ దూసుకెళుతున్నారు. గత రెండు పర్యాయాల నుంచి బాలయ్య హిందూపురంలో సత్తా చాటుతున్న విషయం తెలిసిందే.అయితే ఇక్కడ బాలయ్యకు చెక్ పెట్టాలని అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైసీపీ ప్రయత్నిస్తూనే ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక కుప్పం స్థానంపై ఫోకస్ పెట్టి అక్కడ చంద్రబాబుకు ఏ విధంగా చెక్ పెట్టడానికి చూస్తున్నారో తెలిసిందే. అలాగే హిందూపురంపై ఫోకస్ చేసి బాలయ్యకు చెక్ పెట్టాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నేతలు అనేక రకాల స్కెచ్‌లతో బాలయ్యని ఓడించాలని చూస్తున్నారు. ఎలాగో అధికారంలో ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటింది.దీంతో బాలయ్య పని అయిపోయిందనుకుంటే పొరపాటే..ఎందుకంటే అధికారంలో ఉన్నారు కాబట్టి వైసీపీ లోకల్ ఎన్నికల్లో గెలిచింది. సాధారణ ఎన్నికలొచ్చేసరికి పరిస్తితి మారిపోతుంది. ఇక్కడ బాలయ్యని దాటి వేరే నాయకులని గెలిపించడం కష్టం. అందుకే బాలయ్యని నెగిటివ్ చేసేందుకు వైసీపీ గట్టి ప్రయత్నాలే చేస్తుంది. ప్రతి ఇష్యూలోనూ వైసీపీ నేతలు బాలయ్య ఇంటిని ముట్టడిస్తున్నారు. తాజాగా ఒక డంపింగ్ యార్డు విషయంలో వైసీపీ నేతలు, బాలయ్య ముందు హడావిడి చేశారు. అధికారంలో ఉన్నది వైసీపీ..సమస్యని పరిష్కరించాల్సింది వైసీపీ?అయినా సరే వారు బాలయ్యని టార్గెట్ చేశారు.అదే సమయంలో టీడీపీ నేతలు సైతం బాలయ్య ఇంటికొచ్చి వైసీపీ నాయకులని అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నేతల హడావిడి విఫలమైంది. అంటే ఏదొక విధంగా బాలయ్యపై నెగిటివ్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని, కానీ అది సాధ్యపడదని హిందూపురం బరిలో బాలయ్యని ఓడించడం వైసీపీకి సాధ్యం కాదని టీడీపీ శ్రేణులు కౌంటర్లు ఇస్తున్నాయి.

# నెల్లూరు నగరంలో అగ్నిప్రమాదం..ఇల్లు దగ్ధం

నెల్లూరు నెల్లూరు నగరంలోని ఆచారి వీధిలోని ఓ ఇంట్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. అగ్నిప్రమాదానికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అయితే ముసుగు ధరించిన ఓ వ్యక్తి చేతిలో పెట్రోలు బాటిల్తో వచ్చి ఇంటి మొత్తం తగలబెట్టాడని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.

# వీర్రాజు పై అధిష్టానం గుర్రు..

విజయవాడ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)సోము వీర్రాజు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు. ఏపీ రాజకీయాల్లో కేఏ పాల్ తర్వాత అంతటి కామెడీ లీడర్‌గా మారారంటున్నారు. వీర్రాజు వ్యవహారశైలి మొదటినుంచీ బాగా కాంట్రవర్సీగా మారింది. జగన్‌కు, వైసీపీకి అనుకూలంగా ఉంటారని.. టీడీపీ, చంద్రబాబును పదే పదే టార్గెట్ చేస్తారనే విమర్శ ఉంది. తాజాగా, విజయవాడ ప్రజాగ్రహ సభతో సోము వీర్రాజు వ్యవహారం మరింత వివాదాస్పదమైంది. నాయకుడు అనేవాడికి నాలుక మీద కంట్రోల్ ఉండాలంటారు. వీర్రాజుకు ఆ కంట్రోల్ అసలేమాత్రం లేదంటారు. బీజేపీకి అధికారమిస్తే 50 రూపాయలకే చీప్ లిక్కర్ ఇస్తామంటూ ప్రకటించి కలకలం రేపారు.సోము వీర్రాజు గంటసేపు చేసిన సుదీర్ఘ ప్రసంగం పార్టీ పరువు తీసిందంటున్నారు. వీర్రాజు వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళలంతా మండిపడుతున్నారు. ఇక తెలంగాణ మంత్రి కేటీఆర్ ఇదే ఛాన్స్ అంటూ సోము కామెంట్లను 'వాహ్.. ఎంత గొప్ప పథకం.. ఎంత సిగ్గుమాలిన హామీ.. చీప్ లిక్కర్‌ను రూ.50కి సరఫరా చేయాలనేదే బీజేపీ జాతీయ విధానమా?' అంటూ ట్విట్టర్‌లో సెటైర్లు వేశారు. ఈ డైలాగ్ నేరుగా నేషనల్ బీజేపీ లీడర్స్‌ను హర్ట్ చేసిందంటున్నారు. అటు, పలు జాతీయ పత్రికల్లోనూ, నేషనల్ న్యూస్ ఛానెల్స్‌లోనూ సోము వీర్రాజు స్టేట్‌మెంట్‌పై వార్తలు రావడంతో బీజేపీ జాతీయ నాయకత్వం ఉలిక్కిపడింది. ఏపీలో అసలేం జరుగుతోంది? వీర్రాజు సంగతేంటంటూ ఆరా తీసిందట బీజేపీ అధిష్టానం. అటు, విజయవాడ సభ ముగియగానే సోము వీర్రాజుపై పార్టీ హైకమాండ్‌కు కంప్లైంట్స్ వెళ్లిపోయాయని తెలుస్తోంది. ఆయన మాట్లాడిన ప్రసంగాన్ని.. ఇంగ్లీష్, హిందీ సబ్ టైటిల్స్‌తో పార్టీ పెద్దలకు పంపించారట. జాతీయ మీడియాలో వచ్చిన వార్తల క్లిప్పింగ్స్ కూడా ఢిల్లీ చేరాయని తెలుస్తోంది. అన్నీ చూసి.. రాష్ట్ర అధ్యక్షుడేంటి.. ఇలా మాట్లాడటమేంటని మండిపడుతోందట జాతీయ నాయకత్వం. ఇటీవలే తిరుపతిలో అమిత్‌షా సోము వీర్రాజుకు స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చారు. అమరావతి ఉద్యమంలో ఎందుకు పాల్గొనడం లేదంటూ నిలదీశారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా, వీర్రాజు వారు మారనేలేదు. ఏదో అమిత్‌షా చెప్పారు కాబట్టి.. ఓసారి అమరావతి రైతుల పాదయాత్రకు వచ్చి అటెండెన్స్ వేసుకు వెళ్లారు. ఇక అంతే. అమరావతి కోసం పార్టీ వాయిస్ బలంగా వినిపించింది లేదు. కనీసం తిరుపతిలో జరిగిన అమరావతి రైతుల సభకు కూడా హాజరవలేదు. జగన్‌ను, వైసీపీ ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించింది లేదు. ఆలయాలపై దాడులు జరుగుతున్నా.. తీవ్రంగా స్పందించలేదు. మీడియా సమావేశాల్లో, ట్విట్టర్లో హడావుడి చేయటమే తప్పించి క్షేత్రస్థాయిలో వీర్రాజు బలమైన నేతకాదు. బీజేపీని పూర్తిగా వైసీపీ అనుబంధ పార్టీగా మార్చేశారని అంటారు. అమరావతిపై మాట్లాడిన వారిని సస్పెండ్ చేసి.. పార్టీలో చేరిన కొంత మంది బలమైన నేతలను కోవర్టులుగా చూస్తూ.. ఏపీలో బీజేపీని ఎదగనీయకుండా చేశారన్న అభిప్రాయం ఉంది.ఇవన్నీ చాలవన్నట్టు..

విజయవాడ ప్రజాగ్రహ సభలో నోటికొచ్చినంత మాట్లాడి.. పార్టీని తీవ్ర ఇబ్బందులో పడేశారు. పరోక్షంగా ఆ సభను ఫ్లాప్ చేయాలనే ఉద్దేశంతోనే.. తన రహస్య స్నేహితుడైన జగన్‌కు లబ్ది చేకూర్చాలనే దురుద్దేశంతోనే.. ఆయనలా మాట్లాడారనే ఆరోపణ కూడా వినిపిస్తోంది. అదే విషయం అధిష్టానం చెవిలో వేశారట కాషాయవాదులు. సోము వీర్రాజు తీరుపై ఎప్పటి నుంచో గుర్రుగా ఉన్న బీజేపీ పెద్దలు.. అధ్యక్ష పదవి నుంచి ఆయనను తప్పించాలని దాదాపు డిసైడైపోయారని చెబుతున్నారు. ఇప్పటికే ఆయనకు అధికారాలు కట్ చేశారు. 13 మందితో కోర్ కమిటీని నియమించారు. ఇక త్వరలోనే వీర్రాజును అధ్యక్ష పదవి నుంచి తీసేస్తారని ఢిల్లీ బీజేపీ వర్గాలు అంటున్నాయి.

## క్రీడా పండుగను విజయవంతం చేయండి

**సైకిల్ ర్యాలీ కి విశేష స్పందన**

**ఎమ్మెల్యే భూమన**



తిరుపతి డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) జనవరి 5 నుండి 9వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న కబడ్డీ క్రీడా పండుగలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కబడ్డీ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ప్రకాశం పార్కు నుండి నిర్వహించిన సైకిల్ ర్యాలీ ని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషా, కమిషనర్ గిరీషా, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ లు ప్రారంభించి పాల్గొన్నారు. ప్రకాశం పార్కు నుండి ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ఖాదీ కాలనీ, అన్నారావు కూడలి, కె.టి.రోడ్డు, భవాని నగర్, వి.వి.మహల్ రోడ్డు, మునిసిపల్ ఆఫీస్ మీదుగా ఇందిరామైదానం వరకు సాగింది. మునిసిపల్ కార్యాలయం వద్ద స్కేటింగ్ విద్యార్థులు ఈ ర్యాలీ కి సంఘీభావం తెలిపి ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబడ్డీ ప్రచారంలో భాగంగా ప్రతి రోజూ ఒక వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సైకిల్ ర్యాలీ చేస్తున్నామన్నారు. ఈ ర్యాలీ కి స్కేటింగ్ చిన్నారులు సంఘీభావం తెలపడం సంతోషమన్నారు. కబడ్డీ కి రండి అంటూ వీరు కూడా నగరంలో ప్రచారం చేస్తారన్నారు. కబడ్డీ పోటీలు ఎప్పుడెప్పుడా అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కబడ్డీ పోటీలు ఊహకందని స్థాయిలో విజయవంతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ హరిత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఎస్.కె.బాబు, నరసింహాచారి, శేఖర్ రెడ్డి, ఆంజనేయులు, తాజిన్, అధికారులు పాల్గొన్నారు.

## వస్త్రవ్యాపారుల నిరసన

హిందూపురం కేంద్ర ప్రభుత్వం వస్త్రాలు, గార్మెంట్ ల పై ఐదు శాతం నుంచి 12 శాతానికి జీఎస్టి పెంచడంతో వస్త్రం వ్యాపారులు దుకాణాలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా హిందూపురంలో క్లాత్ మర్చంట్ అసోసియేషన్స్ వారి ఆధ్వర్యంలో వస్త్ర వ్యాపారులు దుకాణాలు మూసి, వినూత్న రీతిలో డప్పులు కొట్టుకుంటూ పేట వెంకట రమణ స్వామి ఆలయం కూడలిలో ర్యాలీ చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కరోనా ప్రభావంతో వ్యాపారాలు లేక, కొంతమంది కనీసం దుకాణాలకు అద్దెలు చెల్లించలేక మూసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. మొదటి రెండవ విడత కరోనా ప్రభావంతో వ్యాపారం లేక బాడుగ అద్దెలకు డబ్బులు చెల్లించాలన్నారు ఇలాంటి విపత్కర సమయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా ఏడు శాతం అదనంగా జీఎస్టి పెంచడం వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఐదు శాతం జీఎస్టీ ని ఉంచాలని డిమాండ్ చేశారు.

## పల్నాడులో టీడీపీ ప్రభంజనం



గుంటూరు, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా పల్నాడు రాజకీయాల్లో కొత్త పరిణామాలు జరుగుతున్నాయి. వైసీపీ ఇలాఖా మాచర్లలో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి జనం నీరాజనాలు పలుకుతున్నారు. పల్నాడులో వైసీపీకి కంచుకోటగా ఉన్న మాచర్ల నియోజకవర్గానికి ఇన్చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డిని నియమించడం ద్వారా సరికొత్త రాజకీయాలకు టీడీపీ తెరతీసినట్లయింది. మాచర్ల టీడీపీ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బ్రహ్మారెడ్డి నియోజకవర్గానికి ర్యాలీగా వచ్చారు. అలా వచ్చిన బ్రహ్మారెడ్డి ర్యాలీకి జనం అడుగడుగునా బ్రహ్మారథం పట్టారు. కారంపూడి నుంచి ర్యాలీ ప్రారంభించిన బ్రహ్మారెడ్డిపైన తెలుగు తమ్ముళ్లు అడుగడుగునా బంతిపూల జల్లులు కురిపించారు. ర్యాలీ సందర్భంగా కారంపూడి నుంచి మాచర్ల వరకు ప్రధాన రహదారులు అన్నీ పసుపుమయంగా మారిపోయాయి. బ్రహ్మారెడ్డి భారీ ప్రదర్శనగా మాచర్ల నియోజకవర్గం ముఖద్వారం కారంపూడి మండలం పేటసన్నెగండ్లలోకి ప్రవేశించారు. బ్రహ్మారెడ్డి ర్యాలీ కారణంగా చాన్నాళ్ల తర్వాత మాచర్లలో టీడీపీ పతాకాలు రెపరెపలాడాయి. దీంతో టీడీపీ నేతల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. ర్యాలీ సక్సెస్ అవడంతో వారంతా పరవశించిపోతున్నారు. అంతర్గత విభేదాలను పక్కన పెట్టి టీడీపీ నేతలంతా ఒకే తాటిపై నిలిచి బ్రహ్మారెడ్డి ర్యాలీని జయప్రదం చేశారు. నియోజకవర్గం నాయకత్వాన్ని ఆశించిన కుర్రి పున్నారెడ్డి,చిరుమామిళ్ల మధుబాబు కూడా బ్రహ్మారెడ్డితో కలిసి ర్యాలీలో పాల్గొనడం టీడీపీ శ్రేణుల్లో ఒక ఊపు వచ్చింది.నిజానికి మాచర్ల నియోజకవర్గం వైసీపీకి కంచుకోటగా ఉంది. ఈ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచీ ఏ ఒక్కరికీ రెండోసారి ఎమ్మెల్యేగా ఛాన్స్ ఇవ్వలేదు. గతంలో ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకే పెట్టని కోటలా ఉండేది. టీడీపీకి నియోజకవర్గంపై గట్టి పట్టు ఉండేది. అలాంటి నియోజకవర్గంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాలుగు సార్లు వరుసగా గెలవడం గమనార్హం. జూలకంటి బ్రహ్మారెడ్డి చేతికి మాచర్ల నియోజకవర్గం బాధ్యతలను టీడీపీ అప్పగించడం సంచలన నిర్ణయమే అని చెప్పొచ్చు. ఎందుకంటే పిన్నెల్లిని ఢీకొట్టడం అంటే అంత ఈజీ ఏం కాదు. క్షేత్రస్థాయి దాకా పిన్నెల్లికి పట్టు ఉంది. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహాత్మకంగా బ్రహ్మారెడ్డికి నియోజకవర్గం పార్టీ పగ్గాలు అప్పగించారు. బ్రహ్మారెడ్డి తల్లిదండ్రులు జూలకంటి నాగిరెడ్డి, దుర్గాంబ ఇద్దరూ మాచర్ల నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేలుగా సేవలు చేసినవారే కావడం గుర్తు చేసుకోవాల్సిన అంశం. రాజకీయ కుటుంబ నేపథ్యం బ్రహ్మారెడ్డి అనుకూలమైన అంశమే. మరో పక్కన టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెన్నుదన్నులు కూడా బ్రహ్మారెడ్డికి అందిస్తుండడం విశేషం

## గంగానగర్ లో కార్డన్ అండ్ సెర్చ్

గోదావరిఖని డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) కమ్యూనిటీ కాంటాక్టింగ్ లో బాగంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గంగా నగర్ లో ఎసిపి గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ లో ఎసిపి తో పాటు ముగ్గురు సిఐలు ఆరుగురు ఎస్సైలు కలిపి మొత్తం 60 మంది పోలీస్ సిబ్బంది కార్డన్ సెర్చ్ లో పాల్గొన్నారు. ఈసందర్భంగా గోదావరిఖని ఎసిపి గిరి ప్రసాద్ మాట్లాడుతూ....... ప్రజల రక్షణలో బాగంగా అపరిచితుల గుర్తింపు లో బాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించామని అన్నారు. ఈ కార్డన్ సెర్చ్ లో సరైన ధృవ పత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 4 కార్లు సీజ్ చేశామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఏరియాలో అనుమానాస్పద వ్యక్తులు, అపరిచితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వివరించారు

## వీఐపీలకు ప్రాధాన్యత తగ్గించాలి

తిరుపతి వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలకు దూర ప్రాంతాల నుంచి నడిచివచ్చే భక్తులకు టిటిడి, శ్రీవారి దర్శన భాగ్యం కల్పించాలని . బిజెపి అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. నాలుగు రోజులముందు అన్నమయ్య నడక మార్గంద్వారా నడిచివచ్చిన వేలాదిమంది భక్తులకు టీటీడీ దర్శనభాగ్యం కల్పించింది. ఆదే విధంగా వీరికి కుడా దర్శనం కల్పించాలని అయన అన్నారు. ప్రతి ఏడాది తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు నడుచుకుంటూ తిరుమలకు చేరుకుంటారు. వీరందరికీ మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. వీఐపీలకు మొదటి ప్రాధాన్యత తగ్గించి, దూరప్రాంతాల నుంచి నడిచి వచ్చే భక్తులకు ప్రాధాన్యత పెంచాలని అయన అన్నారు.

## న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కు నో పర్మిషన్

**- జిల్లా ఎస్పీ అన్బురాజన్**

కడప డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) శనివారం అర్ధరాత్రి వరకు న్యూ ఇయర్ వేడుకలకు అనుమతులు లేదు. బార్లు, స్టార్ హోటళ్లలో అర్ధరాత్రి వరకు పార్టీలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి యువకులు రోడ్ల పై కేకులు కోసి అల్లర్లు చేస్తూ కేకలు వేస్తూ ర్యాష్ డ్రైవింగ్ లు చేస్తే వాహనాలపై తిరగ రాదు. హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కొత్త వేరియంట్ 'ఓమిక్రాన్' వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కోవిడ్ ఆంక్షలు తప్పనిసరి పాటించాలి. డిసెంబర్ 31వ తేదీ రాత్రి నగరంలో గస్తీ ముమ్మరంగా ఉంటుంది. ఓమి క్రాన్ వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం కఠినమైన ఆంక్షలు విధించింది. ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలి. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి అధిక శబ్దాలతో ర్యాష్ డ్రైవింగ్ తో హోరెత్తించడం, బాణసంచా పేల్చడం వల్ల ప్రశాంతతకు భంగం.కలుగుతుంది. వృద్దులకు, చిన్న పిల్లలకు, రోగులకు ఇబ్బంది కలుగుతుంది. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసు బృందాలు బ్లూ కోల్ట్, రక్షక్, స్పెషల్ పార్టీ పోలీసులు డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం నుంచి ముమ్మరంగా గస్తీలు తీరుగుతాయని అయన అన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- ఎస్పీ శ్రీమతి మలిక గర్గ్, ఐపీఎస్.**

ప్రకాశం, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)కోవిడ్ థర్డ్ వేవ్ ముప్పు మరియు కొత్త వేరియంట్ 'ఓమిక్రాన్' వ్యాప్తి దృష్ట్యా ప్రజా భద్రత మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని న్యూ ఇయర్ వేడుకలను కోవిడ్ నియమాలు అనుసరిస్తూ జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ గారు తెలియజేసారు.న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొనుటకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో బహిరంగ ప్రదేశాలు, రోడ్డు కూడళ్ళలో గుమిగూడటం, బహిరంగంగా పార్టీలు, యువత ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి అధిక శబ్దాలతో ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చెయ్యటం, మద్యం త్రాగి వాహనాలు నడపడం, వేడుకలలో ఆప వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొవటం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేసారు. మద్యం షాపులు, వ్యాపార సముదాయాల యజమానులు నిర్దేశించిన సమయంలోగా వారి యొక్క కార్యకలాపాలను ముగించాలని సూచించారు. హోటల్స్ లో, బార్లలో రహస్య పార్టీలు నిర్వహించి నూతన సంవత్సర సంబరాలు చేసుకోవడానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ ఊఖ ల పర్యవేక్షణలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో డిసెంబర్ 31వ తేది సాయంత్రం నుండి అన్ని ముఖ్య కూడళ్ళలో పోలీస్ పికెట్స్, నైట్ గస్తీ బృందాలను వుంచి నూతన సంవత్సర వేడుకలలో ఎటువంటి అవాంచనీయ, రోడ్డు ప్రమాద సంఘటనలు జరగకుండా చూసేలా నిరంతర పోలీసు నిఘా ఉంటుందని, కావున ప్రజలు గమనించి స్థానిక పోలీసు అధికారులు మరియు సిబ్బందికి సహకరించాలని, ఎవరైనా పోలీసు ఆంక్షలను మరియు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ప్రజా జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలియజేసారు. ఒంగోలు నగర పరిసర ప్రాంతాల్లో పోలీసు బృందాలు బ్లూ కోల్ట్స్, రక్షక్, స్పెషల్ పార్టీ పోలీసులు డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం నుంచి ముమ్మర గస్తీలు నిర్వహిస్తారని, ఎవరైనా నిబంధనలకు పాటించకపోతే చర్యలు తీసుకుంటారన్నారు.ఈ నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, సరికొత్త విజయాలను అందుకొని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని జిల్లా ఎస్పీ గారు ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఏనుగులనుంచి కాపాడండి

విజయనగరం డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) విజయనగరం జిల్లా పార్వతీపురం డివిజన్ కొమరాడ మండలం అర్థం గ్రామం వద్ద రైతు సంఘం మరియు సి.పి.పిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ఏనుగులు ఎక్కడ నుంచి వచ్చాయి అక్కడికి తరలించాలని మరియు పంట నష్టం చెల్లించాలని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కొల్లి సాంబమూర్తి మరియు రైతులు మాట్లాడారు గత నాలుగు సంవత్సరాలుగా రైతులు పండిస్తున్న పంటలు ఏనుగులు ధ్వంసం చేస్తూ అనేక విధాలుగా పంట నష్టాలు చేకూర్చింది ఆరుగురు రైతులు చనిపోయారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఫారెస్ట్అధికారులు పాలకులు పట్టించుకునే పరిస్థితిలో లేరు ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి ఏనుగులు ఎక్కడినుండి వచ్చాయో అక్కడికి వెంటనే తరలించే విధంగా చర్యలు తీసుకొని.. రైతులకు పూర్తిగా నష్టపరిహారం పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేశారు

## కొత్త ఏడాది లో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

**రాష్ట్ర ప్రజలకు శైలజానాథ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు**

అమరావతి డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కరోనా కల్లోలంలో చిన్నాభిన్నమైన ప్రజల జీవితాలు కొత్త ఏడాది (2022)లో నైనా కొత్త వెలుగులు నింపాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ ఆకాంక్షించారు. రానున్న కొత్త సంవత్సరంలో అయినా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టకుండా పెట్టుబడులు తీసుకువచ్చేలా కృషి చేయాలని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించారు. కరోనా తొలి, రెండో దశల తరువాత మూడో దశ ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్న వేళ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై ఆసుపత్రుల్లో ప్రజలకు అవసరమైన పడకలతో పాటు మందులు, ఆక్సిజెన్ సిలిండర్లు, తగిన సిబ్బంది ఉండేలా చూసి ప్రజల ప్రాణాలను రక్షించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూడా నూతన సంవత్సర వేడుకలను తగు జాగ్రత్తలు తీసుకుని ఇంట్లోనే జరుపుకోవాలని, ఒమిక్రాన్ వేరియంట్ ఆవిర్భావంతో కరోనా ముప్పు మరింత పెరిగిందని, అన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా కుటుంబ సభ్యులతో కలిసి తమ నివాసాలలోనే నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని శైలజానాథ్ సూచించారు.

## సినిమా థియేటర్లలో వాటి సంగతేంటీ



హైదరాబాద్, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) సినిమా అంటే.. వినోదం. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సినిమా అంటే విచారం అనేలా ఉంది. ఎందుకంటే సినిమా లగ్జరీగా మారుతోంది. మల్టీప్లెక్స్‌ల కారణంగా.. మధ్యతరగతికి అందని ద్రాక్షలా మారుతోంది. అందినా జేబుకు చిల్లే. సినిమాకు వెళ్తే పర్సు ఖాళీ అవుతోంది. మల్టిప్లెక్సుల్లో జరుగుతోన్న మల్టీలెవల్ దోపిడీపై ఆపరేషన్ తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మ్యాటర్ ఏంటో ఇప్పుడు చూద్దాం..మారుమూలలలో ఉండే ఆర్డినరీ థియేటర్ దగ్గర్నుంచి సిటీల్లో ఉండే మల్టిప్లెక్సుల వరకు క్యాంటీన్లలో జరుగుతోన్న దోపిడీని కళ్లకు కట్టినట్టు చూపించారు మల్టీప్లెక్స్ మాఫియాకు ఎదురెల్లిమరీ క్యాంటీన్ల మాఫియా ఆగడాలను బయటపెట్టింది. మల్టిప్లెక్సుల్లో క్యాంటీన్ల దోపిడీ ఎలాగుందో? ఫుడ్ ఐటెమ్స్ రేట్లు ఏ రేంజ్‌లో ఉన్నాయో? కొనలేని పరిస్థితి ఎందుకుందో అక్కడి పరిస్థితులను చూస్తే తేటతెల్లం అవుతుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ మల్టిప్లెక్స్‌లో.. ఇంటర్వెల్‌లో కూతురికి ఏదైనా కొనిపిద్దామని వెళ్లిన తల్లికి మైండ్ బ్లాంక్ అయ్యింది. క్యాంటీన్‌లో ఉన్న రేట్లను చూసి దిమ్మతిరిగిపోయింది. పాప్ కార్న్, సమోసా, చాక్లెట్స్, బిస్కెట్స్, కూల్ డ్రింక్స్, టీ, కాఫీ రేట్లను చూశాక వారికి ఫ్యూజులు ఎగిరిపోయాయి. చివరికి వాటర్ బాటిల్ కొందామనుకున్నా వంద రూపాయలు ఉండటంతో చుక్కలు కనిపించాయ్. ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ఉన్న ఆ ధరలను చూసి ఆ తల్లి వెనక్కి వచ్చేసింది. ఒక్క పాప్ కార్న్ ధరే మూడు నాలుగొందలు ఉండటంతో మారు మాట్లాడకుండా రిటర్న్ అయ్యింది.ఈ మాఫియా మరో మాయ ఏంటంటే.. పిల్లలే టార్గెట్‌గా క్యాంటీన్లలో ఫుడ్ ఐటెమ్స్ పెడతారు. కొనకపోతే పిల్లలు మారాం చేస్తారు. దాన్ని క్యాష్ చేసుకుని దోపిడీకి స్కెచ్ వేశారు. ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లు ఇక్కడ కూడా అదే జరిగింది. క్యాంటీన్‌లో రేట్లు చూసి ఆ తల్లి వెనక్కి వెళ్లిపోతుంటే కూతురు మారాం చేసింది. కొనాల్సిందేనంటూ పట్టుబట్టింది. చివరికి చేసేదేమీ లేక కూతురికి పాప్ కార్న్, కూల్ డ్రింక్ కొనివ్వాల్సి వచ్చింది. ఇలా ప్రజల బలహీనతలనే వాళ్లకు ఆయుధం. పిల్లల మనస్తత్వమే వాళ్లకు పెట్టుబడి. రేటు ఎంతున్నా కొంటారన్న నమ్మకం. అందుకే, మల్టీప్లెక్సుల్లో క్యాంటీన్లు ఆడిందే ఆట ? పాడిందే పాటగా సాగుతోంది దోపిడీ. కూల్ డ్రింక్ అడిగితే.. ట్యాప్ తిప్పి.. ఓ ప్లాస్టిక్ టిన్నులో పట్టి ఇస్తాడు. పాప్ కార్న్ కావాలంటే.. ఓ పొట్లంలో ఇస్తాడు. వాటి మీద ఎమ్మార్పీ ఉండదు. క్యాంటిన్‌లో ఎంత చెప్తే అంత చెల్లించాలి. లేదంటే.. నోరు మూసుకుని వెళ్లి సీట్లో కూర్చోవాలి. హైదరాబాద్ లాంటి మహానగరంలోనే ఈ రేట్లు, మారుమూల ఆర్డినరీ థియేటర్లలో మామూలు రేట్లే ఉంటాయని మోసపోకండి. అక్కడా అవే రేట్లు, అధిక ధరలే. అయితే, హైదరాబాద్‌తో పోలిస్తే కాస్త తక్కువ ఉంటాయ్ అంతే.రకంగా చూసినా సినిమాకెళ్తే ఎవరి సరదా అయినా తీరిపోవడం ఖాయం. రెండున్నర గంటల్లో ఎంత వినోదం అందుతుందో తెలియదు కానీ, టెన్ మినిట్స్ ఇంటర్వెల్‌లో మాత్రం ప్రతి ఒక్కరి సరదా తీర్చేస్తున్నాయ్ క్యాంటీన్లు. నలుగురంటే నలుగురుండే ఓ చోటా ఫ్యామిలీ సినిమాకెళ్తే మినిమంలో మినిమం నాలుగు వేలు వదిలించుకుంటే గాని రిలాక్స్ కాలేరంటే దోపిడీ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోండి.


## తాండూర్ లో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు

**డ్రైవర్ ల పై దాడులు అరికట్టాలి**

**ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్ల డిమాండ్**

**నిలిచిపోయిన ప్రైవేటు అద్దె బస్సు సర్వీసులు**

తాండూరు డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణములో ఆర్టీసీ ప్రైవేట్ అద్దె బస్సు డ్రైవర్ పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ప్రైవేటు ఆర్టీసీ అద్దె బస్సు సర్వీసులు నిలిపివేసి ఆందోళనలు నిర్వహించిన ఆర్టీసీ ప్రైవేటు బస్సు డ్రైవర్లు.వివరాల్లోకి వెళితే యాలాల మండలం లక్ష్మీ నారాయణ పూర్ గ్రామంలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనంకు బస్సు ఢీకొన్నదంటూ సుమారు ఆరుగురు వ్యక్తులు డ్రైవర్ పై దాడి చేసి అంతటితో ఆగకుండా తాండూర్ బస్ డిపోకు చేరుకొని అతి క్రూరంగా వెంటపడి తరుముకుంటూ దాడి చేసి గాయపరిచిన సంఘటన తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది.ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులు వెంటనే అరెస్టు చేయాలంటూ ప్రవేట్ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ముక్కుమ్మడిగా ప్రైవేటు బస్సులను నిలిపివేసి ఆందోళన నిర్వహిస్తున్నారు.దీనితో సుమారు 40 ఆర్టీసీ ప్రైవేటు అద్దె బస్సులు డిపో కే పరిమితమయ్యాయి. ప్రైవేటు అద్దె బస్ డ్రైవర్ల ఆందోళనలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు. ఇట్టి ఘటనపై ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్లు మాట్లాడుతూ గతంలో కూడా నాలుగైదు ఇలాంటి సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాలులో ప్రైవేటు వ్యక్తులకు స్థానం





## మీటింగ్ లో ఏవైరికైనా బీపి వస్తే అంతే గతంలో జరిగిన సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు చూడాలని పలువురు కోరుతున్నారు

నంద్యాల డిసెంబర్ 31,( విభారె) :- నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లకు అధికారులకు విలేకరులకు మాత్రమే అనుమతి ఉందని గతంలో కమిషనర్ చెప్పారు. కాని ఇప్పుడు జరుగుతున్న సమావేశంలో వీరికన్నా ప్రైవేటు వ్యక్తులకు కుర్చీలు వేసి మరి కూర్చోబెట్టారు. గతంలో ఈలాగే ప్రైవేటు వ్యక్తులను మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం లో కూర్చే బెట్టితే ఏమి జరిగిందో అందరికీ తెలిసిందే అటువంటివి పునరావృత్తం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా యమ్ యల్ సీ ఇసాక్ బాష. మరియు చైర్మన్ మబ్బున్నిసా కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు. సమావేశం లో పట్టణంలో పలు సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్లు అక్రమణలు జరిగాయని తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ మాట్లాడుతూ కొందరు పేదలు పుత్ పాతులు ఆక్రమించుకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారని అటువంటి వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. బడా వ్యాపారులు బహుల అంతస్తుల భవనాలు నిర్మించు చున్నారని అటువంటి వారిని వదలకుండా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభ మొదలైన అరగంట పాటు ఉండి సభ పూర్తి కాకుండానే కొందరు కౌన్సిలర్లు బయటకు పోవడం కొస మెరుపు . అందరూ కలిసి కట్టుగా నంద్యాల అభివృద్ధి కోసం కృషి చేథ్థాం అని అన్నారు.

# పోరాటయోధుడు ముత్తుకూరు గౌడప్ప కు ఘన నివాళులు



తుగ్గలి: డిసెంబర్ 31,( విభారె) : తుగ్గలి మండలం పరిధిలోని గల బొందిమడుగుల గ్రామంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తుకూరు గౌడప్ప 220 వర్ధంతిని శ్రీవల్లి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ,శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున బొందిమడుగుల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ నిర్మాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాయలసీమ జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొని ముత్తుకూరు గౌడప్ప చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా బొందిమడుగుల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు,శ్రీవల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతాప్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ బ్రిటిష్ వారి ఆగడాలను 1801లోనే అర్థం చేసుకొని రైతుల పక్షాన పోరాటం చేసిన గొప్ప యోధుడు, స్వాతంత్ర సమర యోధుడు ముత్తుకూరు గౌడప్ప అని వారు కొనియాడారు. బ్రిటిష్ వాళ్లు ప్రవేశపెట్టిన రైత్వారీ విధానం రైతుల వెన్ను విరుస్తుందని గ్రహించి రైతుల కోసం చివరి వరకు పోరాటం చేసిన గొప్ప వ్యక్తి ముత్తుకూరు గౌడప్ప అని తెలిపారు. 1801 డిసెంబర్ 19 వ తారీకున బ్రిటిష్ వాళ్ళు పెంచిన భూమి శిస్తూ కు వ్యతిరేకంగా మొదలైనటువంటి యుద్ధం కొంత మంది స్థానిక ద్రోహులు బ్రిటిష్ వారికి అమ్ముడు పోవడంతో డిసెంబర్ 31న ముత్తుకూరు గౌడప్ప ను ఊరు వాకిలి కు ఉరితీయడంతో ఆ పోరాటం ముగిసిందని వారు తెలిపారు. రైతుల కష్టాలు తెలుసుకొని గతంలో రైతాంగ పోరాటం చేసినటువంటి గొప్ప మహనీయుడు ముత్తుకూరు గౌడప్ప,కొన్ని కారణాల వల్ల ఆ మహనీయుని చరిత్ర కాలగర్భంలో కలిపే ఒక పెద్ద కుట్ర జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి మహనీయుల చరిత్రను తెలియజేయడం ద్వారా వారిలో దేశభక్తి త్యాగాలను భావితరాల విద్యార్థులకు ముత్తుకూరు గౌడప్ప చరిత్ర పనిచేస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బొందిమడుగుల ప్రాథమికొన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగార్జున,వాలంటీర్ జ్యోతి,గ్రామ పెద్దలు సంజీవ రాయుడు,మాజీ ఎస్ఎంసి చైర్మన్ సుధాకర్,కురువ శ్రీరాములు,వడ్ల సుబ్బ రాయుడు,శీను,బొందిమడుగుల గ్రామ యువత సంజయ్ గౌడ్,లవన్న,చిగిలి సురేంద్ర,వీర బ్రాహ్మయ్య ఆచారి,మాబు,కొట్టం షేక్ షా,వడ్డే వీరేంద్ర,రేవంత్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొని ముత్తుకూరు గౌడప్ప కు ఘనంగా నివాళులు అర్పించారు.

# నూతన సంవత్సరంలో నైనా ప్రజలందరూ శుఖ సంతోషాలతో ఉండాలి

## సీపీఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్



నంద్యాల డిసెంబర్ 31,( విభారె) :- ఈ నూతన సంవత్సరం నుండి అయినా ప్రజలు సంతోషంగా ఇబ్బందులకు గురి కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ షరీఫ్ భాష నాయకులు సుశీలమ్మ శ్రీను సురేంద్ర గుప్తా తదితరులు భగవంతుడిని వేడుకున్నారు. నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రెండు సంవత్సరములు పైబడి ప్రజలు కరోనా మహమ్మారి వల్ల జీవనోపాధి కుదేలై బాధపడుతున్నారని . కూలినాలి చేసుకునే పేదవారికి పనులు లేక ఇబ్బందులు పడ్డారని చిన్న పెద్ద పరిశ్రమలు మూతబడి కార్మికులు ఉద్యోగస్తులు రోడ్డున పడ్డారని దానికి తోడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడం వల్ల ప్రజలు అన్నమో రామచంద్రా అని అలమటించినారని అన్నారు. .చిన్న రాష్ట్రమైన జార్ఖండ్ ప్రభుత్వం పెట్రోల్ లీడర్ పై 25 రూపాయలు తగ్గించడం జరిగిందని . అదేవిధంగా మన రాష్ట్రం కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కొత్త సంవత్సరం నుండి అయినా పెరిగిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలని అన్నారు.

# శ్రీవారి దయతోనే తిరుపతి లో మహిళ విశ్వవిద్యాలయం

## విశ్వవిద్యాలయం అభివృద్ధి కి టీటీడీ ఇతోధిక సహాయం నూతన భవనం, ఆడిటోరియం ప్రారంభ సభలో టీటీడీ ఛైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి

తిరుపతి డిసెంబర్ 31,( విభారె) తిరుపతి లో మహిళలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు అయ్యిందంటే అది శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దయే నని టీటీడీ చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. మహిళ విశ్వవిద్యాలయం అభివృద్ధికి టీటీడీ ఇతోధిక సహాయం అందిస్తోందని అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో నూతనంగా నిర్మించిన కెఎల్ రావు భవనాన్ని, ఆడిటోరియం, లైవ్లీ హుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్, మెడిసినల్ ప్లాంట్ పార్క్ , సెంటర్ ఫర్ ఉమెన్ సేఫ్టీ లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో శ్రీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, మహిళ విశ్వవిద్యాలయం నిర్మాణానికి టీటీడీ 130 ఎకరాల భూమి అందించిందన్నారు. దీంతో పాటు ఏటా కోటి రూపాయల గ్రాంట్ అందిస్తోందన్నారు. రూ 20 లక్షలతో యూనివర్సిటీ ఆవరణం లో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం నిర్మిస్తున్నామని, ఈ ఆలయం త్వరలో భక్తులకు, విద్యార్థినులకు అందుబాటులోకి వస్తుందని ఛైర్మన్ శ్రీ సుబ్బారెడ్డి వివరించారు. సృష్టికి మూలం స్త్రీ,స్త్రీ లేకుండా సమాజం లేదన్నారు. సంపూర్ణ ప్రేమ తత్వంలో ఆమె " శక్తి " గా అవతరించిందని చెప్పారు. అలాంటి స్త్రీ మూర్తులందరికి సంపూర్ణంగా, నిండుగా విద్యను అందిస్తూ, సమాజ ఉన్నతికి, తోడ్పడుతున్న శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. జమున రిజిస్ట్రార్ ప్రొ. మమత, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. 500 మంది విద్యార్థినులు కూర్చున గలిగే సదుపాయాలతో ఈ ఆడిటోరియం నిర్మించారని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాలుగా విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి చెందు తోందన్నారు. దేశంలో ఇది రెండవ మహిళ విశ్వవిద్యాలయమని ఆయన చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఫీజ్ రీయింబర్స్ మెంట్ పథకం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు అవుతున్నారని చెప్పారు. మారుతున్న కాలానికి తగిన విధంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆడిటోరియం కు రూపకల్పన చేసిన శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం పరిపాలన విభాగాన్ని శ్రీ సుబ్బారెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టుకు రూ. 98.8 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 600 మంది విద్యార్థులకు సంవత్సరం పాటు నైపుణ్య శిక్షణ ఇస్తారని, తద్వారా వారు సొంతంగా ఉపాధిని పొందడం దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు ఇందులో విద్యార్థినులతో పాటు, ఇతర మహిళలకు బేకరీ ఉత్పత్తుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, ఎంబ్రాయిడరీ, సాంప్రదాయ ఆహార పదార్థాలు తయారు చేయడం నేర్పించడం సంతోషకరమని చెప్పారు. శిక్షణ అనంతరం వీరు ఆర్థికంగా ఎదగడానికి స్వయం ఉపాధి మార్గాలు ప్రారంభిచుకునే వీలు కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే విధంగా నేషనల్ మెడిసనల్ ప్లాంట్ బోర్డు భారత ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖవారిచే ఆమోదించబడిన వివిధ ఔషద గుణములు ఉన్న మొక్కల సమ్మేళనంతో ఏర్పాటు చేసిన హెర్బల్ ప్లాంట్ గార్డెన్, మెడిసనల్ బయోడైవర్సిటి పార్క్ కూడా ప్రారంభించడం సంతోషకరని చెప్పారు.

# బంజరు భూమిని కాదు బంగారు ఇసుకను!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీకపూర్ ఇన్ స్టా షోస్ గురించి తెలిసిందే. ఎప్పటికప్పుడు బికినీలు స్విమ్ సూట్లతో మంటలు పెట్టడం తనకు ఓ హాబీ. తాజాగా ఈ బ్యూటీ మరోసారి భగ భగ మండుతోన్న ఏడారి ఇసుక తెన్నుల మధ్య కెమెరాకి ఫోజులిచ్చింది. మనీష్ మల్హోత్రా ఈ బ్యూటీ కోసం బంగారు కఫ్తాన్ డిజైన్ చేసారు. ఈ లుక్ లో బ్రాంజర్ గోల్డెన్ ఐషాడో టచ్ తో మెరిసిపోతోంది.బంగారు సూర్య చిహ్నాన్ని పాపిడిబొట్టుగా జాన్వీ కి సెట్ చేయడం ఆకట్టుకుంటోంది. సౌదీ అరేబియా ఇసుక ఏడారిలో ఇలా కెమెరాకి ఫోజులిచ్చింది. జాన్వీ దుస్తులు ఏడారికి తగ్గట్టుగా ఫ్లెక్సిబుల గా ఆకట్టుకునేలా ఉన్నాయి. భగభగల సూర్యుని నుండి ప్రేరణ పొంది ఈ డిజైన్ లు రూపొందించారట.జాన్వీ ఈ ఫోటోల్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. "మీరు బంజరు భూమిని ఎక్కడ చూస్తారు? కానీ నేను మాత్రం బంగారు ఇసుకను చూస్తున్నాను" అని పోస్ట్ చేసింది. దీనికి మనీష్ మల్హోత్రా అద్భుతంగా కనిపిస్తోందంటూ వ్యాఖ్యానించారు. జాన్వీ సవతి సోదరి అన్షులా కపూర్ కూడా 'హా' అనే క్యాప్షన్ ఇచ్చి జాన్వీని ప్రశంసించింది. ఇదే నెలలో ఇలాంటి ఫోటో సెషన్లో జాన్వీ పాల్గొనడం రెండవసారి. ఈనెల ఆరంభంలో పౌడర్ పింక్ రిబ్డ్ దుస్తుల్లో ఏడారి రాళ్లపై పడుకుని కెమెరాకి ఫోజులిచ్చింది. నేపాల్-అమెరికన్ డిజైనర్ ప్రబల్ గురుంగ్ ఈ వస్త్రాల్ని డిజైన్ చేసారు.ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో 'దోస్తానా-2' లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది.'మిలీ' అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది. వచ్చే ఏడాది ఆ సినిమా రిలీజ్ కానుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. కానీ సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్దంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

# చరణ్ ఎంట్రీతో దేవరకొండ వెనక్కి తగ్గినట్లేనా?




ఇటీవలే మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తో సుకుమార్ మరో చిత్రం చేస్తున్నట్లు దర్శకుడు రాజమౌళి వెల్లడించిన సంగతి తెలిసిందే. సినిమాలో ఇంట్రడక్షన్ సీన్స్ ఎలా ఉంటాయన్నది కూడా జక్కన్న హింట్ ఇచ్చేసారు. సరిగ్గా 'ఆర్. ఆర్.ఆర్' ప్రమోషన్ లో భాగంగా రాజమౌళి ఇలా టాప్ సీక్రెట్ ని లీక్ చేసారు. అయితే సినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుంది? ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్నది ప్రస్తుత పరిస్థితుల్లో క్లారిటీగా చెప్పలేం కాబట్టి అలాంటి వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం సుకుమార్ 'పుష్ప 'పార్ట్-2' షూటింగ్ లో ఉన్నారు.రెండవ భాగాన్ని మార్చిలో రిలీజ్ చేస్తారు. ఆ తర్వాతే చరణ్ ప్రాజెక్ట్ పై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే ఇక్కడ చరణ్ ఎంట్రీతో విజయ్ దేవరకొండ వెనక్కి తగ్గినట్లేనా? అంటే.. అవుననే గుసగుస వినిపిస్తోంది. విజయ్ దేరకొండ హీరోగా సుకుమార్ ఓ చిత్రానికి కమిట్ అయ్యారు. ఈ సినిమాతో అల్లు అర్జున్ స్నేహితుడు కేదార్ నిర్మాతగా పరిచయం అవ్వాలనుకున్నారు. ప్రాజెక్ట్ అంతా ఒకే అయిపోయింది. అధికారిక ప్రకటన ఇప్పటివరకూ లేదు గానీ తాజా సన్నివేశాన్ని బట్టి ప్రాజెక్ట్ ఉందా లేదా.. ఆలస్యమవుతుందా? అన్న కొత్త సందేహాలు తెరపైకి వస్తున్నాయి. 'ఆర్.ఆర్.ఆర్' రిలీజ్ తర్వాత చరణ్- సుకుమార్ చిత్రాన్ని సెట్స్ పైకి తీసుకెళ్లనున్నారని వినిపిస్తోంది.అయితే ఈ సినిమా వచ్చే ఏడాది మిడ్ లోనో.. చివర్లోనో ప్రారంభం కాదు. 2023 లోనే సెట్స్ కెళ్లే ఛాన్సుంటుందని అంటున్నారు. వచ్చే ఏడాది చరణ్.. గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్.. శంకర్ సినిమాని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ గ్యాప్ లో సుకుమార్ స్క్రిప్ట్ కి తుదిమెరుగులు దిద్దే అవకాశం ఉంది. అలాగే 'పుష్ప' కోసం చాలా కాలంగా శ్రమిస్తున్నారు కాబట్టి విశ్రాంతి కి ఎక్కువ సమయం కేటాయించే అవకాశం ఉందని అంటున్నారు

# 'ఊ..' అంటూ ఓ రేంజ్లో రచ్చచేసినవి ఇవే

సినిమాలో ఎన్ని మాస్ ఫైట్ లు.. రొమాంటిక్ సీన్ లు.. అదిరిపోయే పాటలు వున్నా మాస్ విజిల్స్ లేని స్పెషల్ ఐటమ్ నంబర్ లేకపోతే మజా వుండదు. ఇక కమర్షియల్ మూవీ అంటే వడ్డించిన విస్తరిలో ఎన్ని వున్నా మిర్చీ ఘాటు తగిలే బజ్జీ వుండాల్సిందే. అప్పుడే క్లాస్ ఆడియన్ దగ్గరి నుంచి మాస్ ప్రేక్షకుడి వరకు సినిమాని ఎంజాయ్ చేస్తారు. అంతే కాకుండా సినిమాలో ఎన్ని హంగులు వున్నా ఐటమ్ సాంగ్ కున్న ప్రత్యేకతే వేరు. థియేటర్లో పాట మొదలవ్వగానే పడే విజిల్స్.. మాస్ హంగామా మామూలుగా వుండదు. అలా ఈ ఏడాది థియేటర్లలో గోల చేసిన స్పెషల్ ఐటమ్ నంబర్స్ చాలానే వున్నాయి. అవేంటో ఒకసారి లుక్కేద్దాం.ఈ ఏడాది వచ్చిన ఐటమ్ సాంగ్ లలో ప్రధామంగా నిలిచిన పాట 'ఊ.. అంటవా మావ .. ఊఊ అంటావా...'. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన చిత్రం 'పుష్ప : ది రైజ్'. సుకుమార్ తెరకెక్కించిన ఈ మూవీ కోసం సమంతపై చిత్రీకరించిన ఈ పాట ఓ రేంజ్ లో వైరల్ అయిపోయింది. తొలిసారి సమంత చేసిన ఐటమ్ సాంగ్ కావడం.. దేవి ఈ తరహా ప్రత్యేక గీతాలకు స్పెషలిస్ట్ కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. థియేటర్లలో ఈ పాట ఓ రేంజ్ లో కేక పెట్టించింది.బన్నీ సమంతలపై చిత్రీకరించిన ఈ పాట ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారడమే కాకుండా సినిమాకు ప్లస్ గా మారింది. ఈ పాట కోసం సామ్ కోటిన్నర రెమ్యునరేషన్ తీసుకుంది. ఈ పాట తరువాత ఓ రేంజ్ లో వైరల్ అయిన సాంగ్ 'భూమ్ బద్దల్'... మాస్ మహారాజా రవితేజ నటించిన 'క్రాక్' సినిమాలో పంబ్ సాంగ్ గా చిత్రీకరించిన ఈ పాట థియేటర్లలోనే కాకుండా బయట కూడా ఓ రేంజ్ లో పాపులర్ అయింది. ఈ పాటలో అప్సరరాణి వేసిన స్టెప్పులు తమన్ మాస్ బీట్ ఇప్పటికీ రీసౌండ్ ఇచ్చేస్తోంది.ఇక ఈ మాస్ బీట్ తరువాత అంతే స్థాయిలో డించక్ డించక్ ఆడించిన పాట 'డించక్ డించక్ డింకా...'. రామ్ హీరోగా నటించిన 'రెడ్' సినిమాలోనిదీ పాట. హెబ్బా పటేల్ తొలిసారి చేసిన ఐటమ్ నంబర్ ఇది. మణిశర్మ ఓ రేంజ్ లో ఈ పాటకి బీట్ ని అందించి హుషారెత్తించారు. ఇక ఈ రేంజ్లో మాస్ రాయుళ్లని ఆకట్టుకున్న పాట 'పెప్సీ ఆంటీ..'. గోపీచంద్ హీరోగా నటించిన ఈ చిత్రం కోసం 'నా పేరే పెప్సీ ఆంటీ నా పెళ్లికి నేనే యాంటీ.. ' అంటూ సాగే ఈ సాంగ్ ని అప్సరా రాణిపై చిత్రీకరించారు.బిగ్బాస్ సీజన్ 4 తో మళ్లీ వార్తల్లో నిలిచిన మోనాల్ గజ్జర్ ఈ ఏడాది ఐటమ్ పాపగా మారి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బెల్లం కొండ శ్రీనివాస్ హీరోగా నటించిన చిత్రం 'అల్లుడు అదుర్స్'. నభ నటేష్ అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్ లుగా నటించిన ఈ చిత్రం కోసం మోనాల్ గజ్జర్ పై 'రంభ ఊర్వశి మేనక..' అంటూ సాగే ప్రత్యేక ఐటమ్ సాంగ్ ని చిత్రీకరించారు. ఈ పాటలో మోనాల్ తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ సోను సూద్ నటించారు. ఈ పాట కూడా మాస్ ప్రేక్షకుల్ని అలరించి పాపులర్ సాంగుల్లో ఒకటిగా నిలిచింది.

# అందుకే కోహ్లి ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్: మాజీ క్రికెటర్



టీమిండియా టెస్టు కెప్టెన్ విరాట్ కోహ్లిపై మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్ అంటూ కోహ్లిని కొనియాడాడు. వన్డే కెప్టెన్సీ నుంచి అతడిని తొలగించి తప్పుచేశారని అభిప్రాయపడ్డాడు. కాగా దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. 113 పరుగుల తేడాతో గెలుపొంది సెంచూరియన్ లో చరిత్ర సృష్టించింది. సఫారీ కంచుకోటలో జయకేతనం ఎగురవేసిన తొలి ఆసియా జట్టుగా నిలిచింది.ఈ నేపథ్యంలో కోహ్లి సారథ్యంలోని భారత జట్టుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వినోద్ కాంబ్లీ సైతం ఈ విజయాన్ని ఆస్వాదిస్తూ సామాజిక మాధ్యమం 'కూ' వేదికగా సంతోషం వ్యక్తం చేశాడు. అదే విధంగా కోహ్లి కెప్టెన్సీ గురించి ప్రస్తావిస్తూ అతడి ప్రతిభను కొనియాడాడు. ఒత్తిడిలోనూ జట్టును విజయతీరాలకు చేర్చి గొప్ప సారథిగా నిరూపించుకున్నాడన్నాడు. ఈ మేరకు... "కెప్టెన్సీ మార్పు గురించి చర్చోపర్చలు. వాతావరణం కూడా పెద్దగా సహకరించలేదు! కానీ.. మనం అద్భుతాలు చేశాం. ప్రపంచంలోని బెస్ట్ కెప్టెన్ అని తనను ఎందుకు పిలుస్తారో కోహ్లి మరోసారి నిరూపించుకున్నాడు. ఇక బ్యాటింగ్ విషయానికొస్తే... సిరీస్ ముగిసే లోపు పాత కోహ్లిని మనం చూస్తాం" అని కాంబ్లీ ధీమా వ్యక్తం చేశాడు. కాగా దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు బీసీసీఐ కోహ్లికి షాకిచ్చిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో తనతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరుపకుండానే కెప్టెన్సీ నుంచి తొలగించారంటూ కోహ్లి వ్యాఖ్యానించడం వివాదానికి తెరతీసింది. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా టూర్కు వెళ్లిన టీమిండియా కోహ్లి నేతృత్వంలో సరికొత్త రికార్డు సృష్టించడం విశేషం. ఇక వరుణుడు ఆటంకం సృష్టించినా(వర్షం కారణంగా రెండో రోజు ఆట రద్దు) పేసర్ల విజృంభణతో కోహ్లి సేన గెలుపొందిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190